జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త

తెలుగు దిన పత్రిక


చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761


epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

సోమవారం | 5-5-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 329 పేజీలు: 4 వెల : రూ.7




# తల్లిదండ్రులకు.. ప్రేమతో!

* సాబకోటలో స్మృతి నిలయం నిర్మించిన కుమారుడు ప్రసాద్
* గ్రామస్థుల సమక్షంలో ప్రారంభం * అతిథులకు, గ్రామస్థులకు అన్నదానం
* గుడి ప్రారంభం వేళ ఆధ్యాత్మిక కార్యక్రమాలు
* ప్రసాద్‌ను అభినందించిన గ్రామస్థులు




**సమాజంలో విలువలు గణనీయంగా తగ్గిపోతున్నాయి.. బాంధవ్యాలు కరిగిపోతున్నాయి.. ఒకరికొకరు ఏమవుతామో తెలియని పరిస్థితి.. రక్త సంబంధాలు మరుగున పడిపోతున్నాయి. అన్నదమ్ములు, తండ్రీకొడుకులు, భార్యభర్తల మధ్య సంబంధాలు కూడా తెగిపోతున్నాయి. మానవత్వం మాయమవుతున్న వేళ... ఓ కుమారుడు తల్లిదండ్రులకు ఏకంగా ఆలయం కట్టించి, సమాజానికి ఆదర్శంగా నిలిచారు. నూటికో, కోటికో ఒక్కడన్న సామెతను నిజం చేశాడా కుమారుడు. భువి నుంచి దివికేగిన ఆ తల్లిదండ్రులకు ఏకంగా స్మృతి నిలయం నిర్మించి, అందరి మన్ననలు అందుకుంటున్నారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.**

**మందస, మే 4(వార్త):** మందస మండలంలోని సాబకోట గ్రామానికి మంచి గుర్తింపు ఉంది. గ్రామంలో అన్ని వర్గాలు ఉన్నాయి. ఇదే గ్రామానికి చెందిన పాండవ త్రినాథ్ నాయుడు మందస జమీందారుల హయాంలోనే విలేజ్ మున్సిఫ్గా ఉద్యోగం సంపాదించారు. అనంతరం వీఆర్‌ఓగా మందస ప్రాంతంలో పలు చోట్ల పని చేసి, ఉద్యోగ విరమణ పొందారు. వాస్తవానికి త్రినాథ్ ముక్కుసూటి ఉన్న వ్యక్తిత్వం. ఇతరులకు సాయపడడం ఆయన గొప్పతనం. విధి నిర్వహణలో నీతి నిజాయితీగా ఉండడంతో అందరూ త్రినాథుని అభినందించేవారు. క్రమశిక్షణ, అంకితభావం, పట్టుదల కూడా ఆయన సొంతం. దీంతోనే తన ఐదుగురు కుమారులను మంచి వ్యక్తులుగా తీర్చిదిద్ది, ఉద్యోగాలను కూడా కల్పించారు. సహధర్మచారిణిగా, భర్తకు తగిన భార్యగా పాండవ త్రినాథ్ నాయుడు భార్య ద్రాక్షమ్మ కూడా ఆయన జీవితంలో మంచి, చెడులను పాల్పంచుకున్నారు. సాబకోట ప్రాంతంలో మంచి కుటుంబంగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఈ పుణ్య దంపతుల పంచ పాండవుల్లాంటి ఐదుగురు సంతానంలో పాండవ ప్రసాద్ ద్వితీయ సంతానం. ఆయన కూడా చిన్నప్పటి నుంచే ఉదార స్వభావంతో మెలిగేవారు. పదిమందికి సాయపడడం ఆయన నైజం.



మందస హైస్కూలులో చదువుకున్న ప్రసాద్ ప్రైవేటు ఉద్యోగం సంపాదించారు. అంచెలంచెలుగా ఉద్యోగాన్ని అభివృద్ధి చేసుకున్నారు. కుమారులు పెద్ద అయ్యారు. కాలచక్రం తిరిగింది. 1938వ సంవత్సరంలో జన్మించిన త్రినాథ్ నాయుడు 2021వ సంవత్సరంలో స్వర్గస్తులయ్యారు. ద్రాక్షమ్మ 1947వ సంవత్సరంలో జన్మించి, 2016వ సంవత్సరంలో మరణించారు. తల్లిదండ్రులంటే ఎంతో ప్రేమ గల ప్రసాద్ వారి జ్ఞాపకార్థం ముందుగా విగ్రహాలను ఏర్పాటు చేయాలని సంకల్పించుకున్నారు. ఆ నిర్ణయం కాస్తా.. శ్రీపాండవ త్రినాథ్, ద్రాక్షమ్మ స్మృతి నిలయంగా మార్పు చెందింది. తల్లిదండ్రుల విగ్రహాలను తయారు చేయించిన ప్రసాద్, తన సోదరులతో కలిసి.. స్మృతినిలయాన్ని ఆదివారం ప్రారంభించారు. పలు ఆధ్మాత్మిక కార్యక్రమాలు కూడా నిర్వహించారు. అతిథులు, స్థానికులకు అన్నదానం ఏర్పాటు చేశారు. తల్లిదండ్రుల విగ్రహాలకు అన్నదమ్ములంతా కలసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో త్రినాథ్నయుడు, ద్రాక్షమ్మ దంపతుల కుమారులు, కోడళ్లు పాండవ చక్రధర్, లక్ష్మి, పాండవ ప్రసాద్, నిర్మల, పాండవ గజపతి, సుహాసిని, పాండవ నాగరాజు, నిర్మల, పాండవ గణేశ్, మాధవిలతో పాటు కుమార్తె, అల్లుడు నల్లాన తేజేశ్వరి, షణ్ముఖరావు, గ్రామపెద్దలు, స్థానికులు పాల్గొన్నారు. బాంధవ్యాలు ఇంకా మిగిలి ఉన్నాయని, నిరూపించి ఎందరికో ఆదర్శంగా నిలిచిన పాండవ ప్రసాద్ మంచితనానికి పలువురు అభినందనలు తెలుపుతున్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## మద్యం మత్తులో మృతి

**పలాస, మే 4(వార్త):** కాశీబుగ్గలోని ఓ షాపు వద్ద ఆదివారం విగతజీవిగా పడి ఉన్న వృద్ధుడి డెడ్ బాడీ తీవ్ర కలకలం రేపింది. కాశీబుగ్గ న్యూకాలనీకి చెందిన వూన నూకరాజు (65 ) అనే వృద్ధుడు మూడు రోడ్ల జంక్షన్ దగ్గర ఉన్న కిరణా షాపు వద్ద మృతి చెంది ఉండటాన్ని పోలీసులు గుర్తించారు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని కన్నీరు మున్నీరయ్యారు. పింఛను డబ్బులు అందుకున్న నూకరాజు ఇంటికి రాకుండా మద్యం తాగి మృతి చెంది ఉంటాడని కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు తెలుస్తోంది. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పలాస ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన పిర్యాదు మేరకు కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# ప్రశాంతంగా నీట్ ప్రవేశ పరీక్ష

- 96 శాతం హాజరు
- కేంద్రాల వద్ద డ్రోన్లతో నిఘా
- పరిశీలించిన ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి





**శ్రీకాకుళం, మే 4 (వార్త):** వైద్య కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించే నీట్-యుజి పరీక్ష ఆదివారం భారీ భద్రత నడుమ ప్రశాంతంగా నిర్వహించారు. జిల్లా నాలుగు పరీక్ష కేంద్రాల్లో 1568 మంది విద్యార్థులు నీట్ పరీక్షకు హాజరుకావల్సి ఉండగా 41 మంది మినహా మిగిలిన వారంత పరీక్షలు రాశారు. ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు నిర్వహించారు. శ్రీకాకుళం నగరంలోని జరుగుతున్న నాలుగు 'నీట్' పరీక్షా కేంద్రాల వద్ద ఆదివారం జిల్లా ఎస్పి కేవీ మహేశ్వర రెడ్డి బందోబస్తు ఏర్పాట్లు పరిశీలించి పోలీస్ అధికారులు సిబ్బందికి విధి నిర్వహణలపై పలు సూచనలు చేశారు. పాలిటెక్నిక్ కళాశాల, అర్జీయూ కెటి క్యాంపస్, కేంద్రీయ విద్యాలయం, ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలను జిల్లా ఎస్పి సందర్శించారు. పోలీసులు పకడ్బందీ తనిఖీలు నిర్వహించి అభ్యర్థులను లోపలికి అనుమతించారు. మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, హ్యాండ్ బ్యాగ్, వ్యాలెట్లు, చేతి గడియారాలు ఇతర వస్తు సామగ్రి పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించలేదు. పరీక్ష పూర్తయ్యే వరకు ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ పోలీసు సిబ్బందికిసూచించారు. ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా పరీక్ష కేంద్రాల వద్ద పకడ్బందీ ఏర్పాట్లు చేశామన్నారు. పరీక్షా కేంద్రాల సమీపంలో జిరాక్స్, ఇంటర్నెట్ షాపులు మూసివేసేలా చర్యలు తీసుకోవాలని, పరీక్షా కేంద్రాల పరిధిలో ఎవరూ గుంపులుగా ఉండకుండా చూడాలని పోలీస్ అధికారులను ఆదేశించామన్నారు. ప్రతి 'నీట్' పరీక్షా కేంద్రాల పరిసరాల వద్ద డ్రోన్ కెమెరాతో నిఘా ఏర్పాటు చేసి ప్రత్యేక నిఘా పెట్టడం జరిగిందని తెలిపారు. అభ్యర్థులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా మౌలిక సదుపాయాలు కల్పించేలా తమవంతు సహాయ సహకారాలు అందించామని ఎస్పీ తెలిపారు.

# లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

- 20న అఖిలభారత సమ్మె జయప్రదం చేయాలి
- పిలుపునిచ్చిన కార్మిక, ప్రజా సంఘాలు

**శ్రీకాకుళం, మే 4 (వార్త):** కార్మిక హక్కులు కాలరాసే లేబర్ కోడ్ లు రద్దు చేయాలని, కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని కోరుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కేంద్ర కార్మిక సంఘాలు పిలుపు మేరకు ఈనెల 20న అఖిలభారత సమ్మె జయప్రదం చేయాలని కార్మిక,ప్రజా సంఘాలు నాయకులు పిలుపునిచ్చారు. సమ్మె జయప్రదంకై కార్మిక, ప్రజా సంఘాలు జిల్లా సమావేశం సిఐటియు జిల్లా కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో వివిధ కార్మిక, ప్రజా సంఘాలు నాయకులు మాట్లాడుతూ బ్రిటిష్ కాలం నుండి పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను మోడి నాయకత్వంలోని కేంద్ర బిజెపి ప్రభుత్వం పెట్టుబడిదారీ ప్రయోజనాలు కోసం నాలుగు లేబర్ కోడ్ లుగా మార్చి వేసిందని అన్నారు. కార్మిక సంఘాలను బలహీనం చేసి యాజమాన్యాల శ్రమ దోపిడీని మరింత పెంచుకోవడం కోసం, యజమానుల దోపిడీని, అక్రమ తొలగింపులను, పనిభారాన్ని ప్రశ్నించే పరిస్థితి లేకుండా చేయడం కోసం, పని గంటలు పెంచడానికి లేబర్ కోడ్ లు తెచ్చారని అన్నారు. యజమానులు కార్మిక చట్టాలు ఉల్లంఘించినా గతంలో లాగా జైలుకు వెళ్లాల్సిన అవసరం లేకుండా కొంత జరిమానా కడితే సరిపోతుందని చట్టాలలో మార్పులు చేసారని తెలిపారు. యజమానులు చేసే నేరపూరిత చర్యలను నేరాలుగా పరిగణించకుండా కార్మికులు చేసే పోరాటాలను, యాజమానులను ప్రశ్నించినా నేరాలుగా పరిగణించేలా యజమానులు తమ ఇష్టానుసారంగా వ్యవహరించేలా చట్టాలు మారుస్తున్నారని అన్నారు. పెట్టుబడిదారులకు ఉద్యోగులను, కార్మికులను ఆధునిక బానిసలుగా మార్చేవిధంగా కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లు తెచ్చిందని అన్నారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం అదానీ,అంబానీలకు దేశ సంపదను దోచిపెడుతూ కార్పొరేట్ అనుకూల విధానాలు అవలంబిస్తూ కార్మిక, కర్షకులకు ద్రోహం చేస్తుందని అన్నారు. స్వాతంత్ర్యం అనంతరం ప్రజల త్యాగాలతో జాతి నిర్మించుకున్న విశాఖపట్నం స్టీల్ ప్లాంట్, ప్రభుత్వరంగ పరిశ్రమలు, రైల్వేలు, బ్యాంకులు, ఎల్.ఐ.సి, రక్షణ రంగం, గనులు, ప్రకృతి వనరులను కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు ప్రైవేటీకరణను వేగవంతంగా అమలు చేస్తున్నారు. కార్మిక హక్కులు కాలరాసే లేబర్ కోడ్ లకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాడాలని, కార్మికుల జీవన్మరణ సమస్య అని అన్నారు. ఒక వైపు కార్పొరేట్ లు లాభాలు పెరిగాయని కానీ కార్మికుల నిజవేతనాలు దిగజారయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ లకు రాయితీలు ఇస్తూ సామాన్యులపై భారాలు వేస్తుందని అన్నారు. సమాజంలో మత వైషమ్యాలు పెంచి మత చీలికలు తెస్తుందని అన్నారు. ధరల పెరుగుదల, అవసరాలు దృష్టిలో పెట్టుకొని కార్మికుల కనీస వేతనం నెలకు రూ. 26,000లుగా నిర్ణయించి అమలు చేయాలని, కనీస పెన్షన్ రూ.9,000 ఇవ్వాలని డిమాండ్ చేసారు. కాంట్రాక్టు కార్మికులను, స్కీం వర్కర్లను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేసారు. అంగన్వాడీ, ఆశ, మధ్యాహ్నం భోజన పథకం తదితర స్కీ వర్కర్స్ కు కనీస వేతనాలు ఇవ్వాలని, పనిభారం తగ్గించాలని డిమాండ్ చేసారు. 8 గంటలు పని దినంను 12 నుండి 14 గంటలుగా మార్చాలని చూస్తున్నారని అన్నారు. సమ్మె జయప్రదం చేసి కేంద్ర బిజెపి ప్రభుత్వానికి హెచ్చరిక చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు పి.తేజేశ్వరరావు, సి.హెచ్.అమ్మన్నాయుడు, జిల్లా కోశాధికారి అల్లు.సత్యన్నారాయణ, పట్టణ కన్వీనర్ ఆర్.ప్రకాష్, ఎఐటియుసి జిల్లా గౌరవ సలహాదారు చిక్కాల గోవిందరావు, వైఎస్ఆర్ ట్రేడ్ యూనియన్ నాయకులు ఎస్.వెంకటరావు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు మణికొండ.ఆదినారాయణమూర్తి, బ్యాంకు ఎంప్లాయిస్ ఫెడరేషన్ జాతీయ కేంద్ర కమిటీ సభ్యులు ఎమ్.శ్రీనివాస్, బిఎస్ఎన్ఎల్ నాయకులు ఎమ్.గోవర్ధనరావు, రైతు సంఘం నాయకులు కొత్తకోట. అప్పారావు, పెన్షనర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు పార్వతీశం, రిమ్స్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రాకోటి.చిన్నారావు, ఎపి మధ్యాహ్నం భోజన పథకం వర్కర్స్ యూనియన్ నాయకులు టి.ప్రవీణ, పద్మ, కళాసి యూనియన్ జిల్లా అధ్యక్షులు బోర చిన్నారావు పాల్గొన్నారు.





## సామాజిక భవనం ప్రారంభం

**సోంపేట, మే 4 (వార్త):** సోంపేట మండలం, కర్తలిపాలెం గ్రామపంచాయతీ పరిధిలో మండల పరిషత్ నిధులతో నిర్మించిన సామాజిక భవనం, మండపం వాటర్ ట్యాంకును ఆదివారం సోంపేట మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు డాక్టర్ నిమ్మన దాసు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ, ఎంపీటీసీ మంగి గణపతి, సర్పంచ్ పొందూరు గున్నయ్య, వైఎస్ఆర్సిపి మండల అధ్యక్షులు శిలగాన భాస్కరరావు, బాబురావు మాస్టర్, మంగి జ్ఞానేశ్వరరావు, మంగి ధర్మారావు, తామాడ పాపారావు, బి శంకర్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు

## ఎకువూరులో ఎంపిపి దాస్‌కు సన్మానం



**సోంపేట, మే 4 (వార్త):** సోంపేట మండలం ఉప్పలామ పంచాయతీ ఎకువూరు గ్రామంలో కళాభారతి కళాకారుల సమైక్య సంఘం ఆధ్వర్యంలో సోంపేట ప్రజాపరిషత్ అధ్యక్షులు డాక్టర్ నిమ్మాన దాసు దుశ్శాలువతో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పలువురు కళాకారులు పాల్గొన్నారు.

## నర్సింగపురం పంచాయతీ టీడీపీ కార్యవర్గం ఎన్నిక



**మందస, మే 4(వార్త):** మందస మండలం నర్సింగపురం పంచాయతీ తెలుగుదేశం పార్టీ నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. పార్టీ జిల్లా తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి దాసరి తాతారావు అధ్యక్షతన నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పార్టీ అధ్యక్షునిగా భాస్కర్ గౌడో, ఉపాధ్యక్షునిగా సవర ధర్మారావు, ప్రధాన కార్యదర్శిగా మెట్ట చంద్రమౌళి, కోశాధికారిగా గేదెల దుర్యోధన ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, నర్సింగపురం పంచాయతీ లో తెలుగుదేశం పార్టీ కార్యక్రమాలను పలాస శాసన సభ్యురాలు గౌతు శిరీషమ్మ చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు వివరిస్తూ.. ద్విగుణీకృత ఉత్సాహంతో పార్టీని ముందుకు తీసుకు వెళ్లాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సాలిన భీమారావు, మంగళపాత్రో, మండల లచ్చయ్య, కోనారి తులసీరావు, బతకల వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

## చెస్, క్యారంబోర్డు పోటీలు




**మందస, మే 4(వార్త):** వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మందస పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో విద్యార్థులు, పిల్లలకు వివిధ రకాలైన పోటీలు, ఆటలు జరుగుతున్నాయి. దీనిలో భాగంగా ఆదివారం విద్యార్థినీ, విద్యార్థులకు చెస్, క్యారంబోర్డు పోటీలను గ్రంథాలయాధికారిణి జె. విజయలక్ష్మి ఆధ్వర్యంలో జరిగాయి. విద్యార్థులకు పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ నెల 6వ తేదీన విజ్ఞాన శిబిరం ముగుస్తుందని, అదే రోజున ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయం పాఠకులు, స్థానికులు పాల్గొన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## ఘనంగా ఆదిత్యుని కళ్యాణం

**టెక్కలి, మే 4(వార్త):** సూర్య నారాయణ స్వామి ఉషాఛాయా సమేత దేవాలయంలో ఆదివారం స్వామివారి కళ్యాణం ఘనంగా జరిగింది. అభిషేకాలు, కుంకుమ పూజలతో ఆలయ ఆవరణ కోలాహలం చోటు చేసుకోగా, మధ్యాహ్నం నుండి భక్తులు కల్యాణ మహోత్సవం జరిపించారు. ఆరోగ్యం, సకల చర్మ వ్యాధులు, సంతానం లేని వాళ్ళకు సంతాన ప్రాప్తికి దేవాలయ ప్రధాన అర్చకులు బొంగి రవిబాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ మూర్తులను తిరువీధి నిర్వహించారు.





## వైసీపీలోకి చేరికలు

**ఆమదాలవలస, మే 4 (వార్త):** ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధిలో 8వ, 14వ వార్డులు ఐ.జే.నాయుడు కాలనీకి చెందిన 25 మంది యువకులు వైసిపి నియోజకవర్గ ఇన్చార్జ్ చింతాడ రవికుమార్ ఆధ్వర్యంలో ఆదివారం వైసీపీలో చేరారు. వారికి చింతాడ రవికుమార్ పార్టీ కండువా వేసి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా చింతాడ మాట్లాడుతూ రాష్ట్రంలో మార్పు మొదలైందన్నారు. రాబోయే రోజుల్లో కూడా ఇలాంటి మార్పులు మరెన్నో జరుగుతాయని, మళ్లీ వైసీపీ ప్రభుత్వమే వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్ కుమార్, ఆమదాలవలస పట్టణ అధ్యక్షులు పొడుగు శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి పొన్నాడ చిన్నారావు, కార్యకర్తల పాల్గొన్నారు.


## పోటెత్తిన అరసవల్లి



**అరసవల్లి, మే 5 (వార్త):** అరసవల్లి సూర్యనారాయణస్వామి దేవస్థానానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. క్యూలైన్లు కిటకిటలాడాయి. ఆదివారం ఒక్కరోజే సూర్యనారాయణ స్వామి వారికి టికెట్లు రూపేనా రూ.7,36,000, పూజలు, విరాళాల రూపంలో రూ.98252, ప్రసాదాల రూపంలో రూ.2,04000, ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో శోభారాణి, ఉప కమీషనర్ మరియు కార్య నిర్వహణాధికారి తెలిపారు.

## బాడీ బిల్డింగ్ పోటీల్లో మెరిసిన ఆణిముత్యం

### అభినందించిన ఎమ్మెల్యే గొండు శంకర్



**శ్రీకాకుళం, మే 4 (వార్త):** పార్వతీపురంలో మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ పోటీల్లో శ్రీకాకుళం జిల్లా, చల్లపేట గ్రామానికి చెందిన ఎస్ వైకుంఠ రావు 60 కేజీల కేటగిరిలో నాలుగో స్థానం దక్కించుకున్నాడు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ పార్టీ కార్యాలయంలో బాడీ బిల్డర్ వైకుంఠరావును అభినందించారు. గెలుపోటములు సహజమని, శ్రీకాకుళం నుంచి పోటీల్లో పాల్గొనడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో స్టార్ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ కార్యదర్శి వి. విజయ్ కుమార్, అధ్యక్షులు బి. ప్రసాద్, టీడీపీ అధికార, కార్యకర్త ప్రతినిధుల బృందం పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

**సంతబొమ్మాళి, మే 4 (వార్త):** దండు గోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2009-10 పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. తమ గురువులు ధనుంజయరావు దాశరథి, పాపారావు, విజయ్‌కుమార్, లోకేశ్వరరావు, చిన్నవాడు, శ్రీనివాసరావు, మోహనరావు, శ్యామలరావు, రాము, భాస్కరరావు, ప్రకాషరావు, నగేష్‌లకు సన్మానించారు. ముఖ్య అతిథిగా ఐఏఎస్ అధికారి రోణంకి గోవిందరావు హాజరుకాగా, ఆంగ్ల ఉపాధ్యాయులు భాస్కరరావు అధ్యక్షత వహించారు.



# సీనియర్ జర్నలిస్టులకు ప్రభుత్వం పింఛన్లు ఇవ్వాలి

*** ఏపీ ఓల్డేజ్ వర్కింగ్ జర్నలిస్ట్ వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు కర్రి శంకర్‌రెడ్డి * నూతన కార్యవర్గం ఎంపిక**

**టెక్కలి, మే 4 (వార్త):** రాష్ట్రంలోని ఓల్డేజ్ వర్కింగ్ జర్నలిస్టులకు ఇతర రాష్ట్రాల్లో పింఛను పదివేలు ఇస్తున్నారని, ఏపీలో కూడా ఇవ్వాలని ఏపీ ఓల్డేజ్ వర్కింగ్ జర్నలిస్ట్ వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు కర్రి శంకర్ రెడ్డి డిమాండ్ చేశారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలిలోని పెన్షనర్ల భవనంలో ఆదివారం ఏపీ ఓల్డేజ్ వర్కింగ్ జర్నలిస్ట్ వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజానికి ఎన్నో ఏళ్లుగా సేవలు అందిస్తూ ఇప్పటికీ వృద్ధాప్యంలో కూడా జర్నలిస్టు వృత్తిలో కొనసాగుతున్నారన్నారు. ఓల్డేజ్ వర్కింగ్ జర్నలిస్టులకు పాలక ప్రభుత్వాలు కనీసం పట్టించుకోవట్లేదని ఆయన ఆవేదం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఓల్డేజ్ వర్కింగ్ జర్నలిస్టులకు పింఛన్లతో పాటు ఇళ్ల స్థలాలు, అక్రిడేషన్ కార్డులు, ఉచితంగా కార్పొరేటర్ హాస్పిటల్లో వైద్యం, ప్రమాద బీమా, రైలు ప్రయాణ సౌకర్యం, తదితర సదుపాయాలు కల్పించాలన్నారు. అనంతరం ఈ సందర్భంగా ఏపీ ఓల్డ్ ఏజ్ వర్కింగ్ జర్నలిస్ట్ వెల్ఫేర్ సొసైటీ కి జరిగిన ఎన్నికల్లో రాష్ట్ర అధ్యక్షునిగా కర్రి శంకర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే గౌరవ అధ్యక్షులుగా పేడాడ పరమేశ్వరరావు, ఉపాధ్యక్షులు కిల్లి శ్రీనివాస్ రావు, అశోక్ కుమార్ రెడ్డి, ఎస్. విశ్వేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా పి .వి.ఎస్.ఎన్ మూర్తి, సంయుక్త కార్యదర్శులుగా ఎన్.చంద్రరావు, ఆర్వీ పట్నాయక్, కోశాధికారిగా బగాది వాసుదేవరావులతో పాటు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.




# కిస్నా డైమండ్ అండ్ గోల్డ్ జ్యువెలరీ షో రూమ్ ప్రారంభం

**శ్రీకాకుళం, మే 4 (వార్త):** ప్రముఖ బంగారు వజ్రాభరణాల సంస్థ కిస్నా డైమండ్ అండ్ గోల్డ్ జ్యువెలరీ వారు ఆంధ్రప్రదేశ్లోని తమ రెండవ ఎక్స్ క్లూజివ్ షోరూమ్‌ను ఆదివారం శ్రీకాకుళం పాలకొండ రోడ్ లోని గాంధీ పార్క్ పక్కన ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు హాజరై ఈ నూతన షో రూమ్‌ను ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఉత్తరాంధ్ర ప్రాంతంలో బంగారు వజ్రాభరణాల ప్రేమికులకు అత్యంత చేరువలో అత్యాధునిక డిజైన్లు, వెరైటీలతో కిస్నా డైమండ్ అండ్ గోల్డ్ జ్యువెలరీ వారు తమ శాఖను ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ ప్రాంత ప్రజలు నూతన వెరైటీల కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా నచ్చిన మోడళ్లను అతి తక్కువ సమయంలో ఇక్కడే కొనుగోలు చేయవచ్చునన్నారు. ఉత్తరాంధ్ర ప్రాంతంలో కిస్నా సంస్థ వారు మరిన్ని షో రూమ్ లను ప్రారంభించాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం హరికృష్ణ గ్రూపు వ్యవస్థాపకుడు ఘనశ్యామ్ డోకియాల మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రం బంగారు ఆభరణాల మార్కెట్‌కు అనుకూలంగా ఉందన్నారు. ఈ ప్రత్యేక షో రూమ్ శ్రీకాకుళం వాసుల అభిమానాన్ని ఆదరణను పొందుతుందన్నారు. తమ సంస్థ భారత దేశంలోనే అత్యంత వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న బంగారు నగల వ్యాపార సంస్థని ఆయన అన్నారు. కిస్నా డైమండ్ అండ్ గోల్డ్ జ్యువెలరీ డైరెక్టర్ పరాగ్ షా మాట్లాడుతూ రానున్న మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకొని తయారుచేసిన ప్రత్యేక కలెక్షన్ అందుబాటులో ఉందని ప్రారంభోత్సవ కానుకగా డైమండ్ జ్యువలరీ మేకింగ్ చార్జీలపై 50 - 100 శాతం తగ్గింపు అందిస్తున్నామన్నారు. స్థానిక ప్రాంత సాంస్కృతిని ప్రతిబింబించే విధంగా పలు డిజైన్లను ఈ షో రూమ్ లో అందుబాటులో ఉంచడం జరిగిందని స్థానిక ప్రజలు తమ షో రూమ్ ను సందర్శించి తమను ఆదరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కిస్నా ఫ్రాంచైజీ పార్టనర్లు సరిత, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం నూతన షోరూం ప్రారంభోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. అలాగే అన్నదానం కార్యక్రమాన్ని నిర్వాహకులు చేపట్టారు.




# భగీరథ మహర్షి పట్టుదల స్ఫూర్తిదాయకం

*** జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు**

**శ్రీకాకుళం, మే 4(వార్త):** భగీరథ మహర్షి పట్టుదలతో దివి నుండి భువికి లోక కల్యాణం కోసం గంగను తెచ్చిన మహానుభావుడని, ఆయన జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వర రావు కొనియాడారు. ఆదివారం భగీరథ మహర్షి జయంతి సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగీరథ మహర్షి ఎంతో పట్టుదల కలిగిన వ్యక్తి అని, ఎన్ని అవాంతరాలు ఎదురైనా దివి నుండి భువికి గంగను లోక కల్యాణం కోసం తెచ్చిన మహాను భావుడన్నారు. ఆయన పట్టుదలకు మారు పేరని, అందుకే ఆయన అపర భగీరథుడుగా పేరొందారన్నారు. మరుగునపడిన చరిత్రకారుల జీవితాలను, మహనీయుల గొప్పతనాన్ని వెలికితీసి వారి ఆదర్శ భావాలకు అనుగుణంగా ప్రభుత్వం అధికారికంగా ఇలాంటి కార్యక్రమాలను చేపడుతుందన్నారు. అంతకు ముందు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి ఇ. అనూరాధ, బిసి సంక్షేమ శాఖ జాతీయ కార్యదర్శి డా. బి. దేవభూషణరావు, ఉప్పర సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు వెంకట రామారావు, సెక్రెటరీ గజ్జల మాధవ రావు ఉపాధ్యక్షులు పిండి రాము, కలెక్టరెట్ ఎ ఓ సూర్యనారాయణ, బి. సి వెల్ఫర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




### ఘనంగా భగీరథ మహర్షి జయంతి వేడుక

గంగను భువికి తెచ్చిన మహనీయుడు భగీరథ మహర్షిని స్మరించడం, పూజించడం మనందరి కర్తవ్యమని డీఎస్పీ సీహెచ్ వివేకానంద అన్నారు. భగీరథ మహర్షి జయంతిని పురస్కరించుకుని జిల్లా పోలీసు కార్యాలయంలో శ్రీకాకుళం టౌన్ డిఎస్పీ సి. హెచ్. వివేకానంద్ జిల్లా పోలీసు కార్యాలయంలో భగీరథ మహర్షి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏదైనా సాధించాలనే పట్టుదలకు భగీరథ ప్రయత్నం ఒక స్ఫూర్తి అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ పైడపు నాయుడు, ఆర్ఐ కె.నర్సింగారావు, కార్యాలయ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## పది విద్యార్థులకు ప్రోత్సాహకాలు



**శ్రీకాకుళం, మే 4 (వార్త):** విద్యార్థులను కోరాడ రమేష్ తమ సంస్థ ద్వారా ప్రోత్సహించడం చాలా అభినందనీయమని 31 డివిజన్ టీడీపీ ఇన్‌చార్జ్ విభూది సూరిబాబు కొనియాడారు. పదవ తరగతి లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు కోరాడ రమేష్ తమ సంస్థ అంజయ్య మిక్చర్లు ద్వారా ప్రోత్సాహకాలను ఆదివారం అందజేశారు. 31వ డివిజన్‌కు చెందిన నవ్య శ్రీ పదవ తరగతిలో 581 మార్కులు సాధించింది. ఆమెకు నగదు బహుమతిని విభూది సూరిబాబు చేతులమీదుగా అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా విభూది సూరిబాబుమాట్లాడుతూ ఇదే స్ఫూర్తితో భవిష్యత్‌లో మరెంత ఉన్నత స్థానాలకు చేరుకొని సమాజానికి, తల్లిదండ్రులకు ఉపయుక్తంగా ఉండాలని సూచించారు.




# బారువ తీరం.. జనసంద్రం

*** ముగిసిన బారువ బీచ్ ఉత్సవాలు * శ్రీకాకుళం పర్యాటకానికి కొత్త వెలుగు * తరలివచ్చిన వేలాది పర్యాటకులతో బీచ్ కిటకిట * ఆకట్టుకున్న క్రీడలు, సాంస్కృతిక ప్రదర్శనలు**



**సోంపేట, మే 4 (వార్త):** శ్రీకాకుళం తూర్పు తీరంలో బారువ బీచ్ ఉత్సవం రెండురోజులుగా సందడిగా సాగి, ప్రజల ఆనందోత్సాహాల నడుమ విజయవంతంగా ముగిసింది. ప్రకృతి, పర్యాటకం, సాహస క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, స్థానిక రుచులు అన్నీ ఒకే వేదికపై నిలిచిన ఈ వేడుక పర్యాటక అభివృద్ధికి ఓ ప్రేరణగా నిలిచింది. ప్రతి ఉదయం తాబేలు పిల్లల సముద్ర ప్రయాణంతో ప్రారంభమైన ఈ ఉత్సవం, పర్యావరణ పరిరక్షణకు నిదర్శనమైంది. వాలీబాల్, ట్రెజర్ హంట్‌లు, కయాకింగ్, స్నోర్కెలింగ్ వంటి సముద్ర క్రీడలతో యువతను ఆకట్టుకోగా, శాండ్ స్కల్ప్చర్, ఓపెన్ ఆర్ట్ పోటీలు కళాకారుల ప్రతిభను ప్రపంచానికి పరిచయం చేశాయి. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన సందర్శకులు స్థానిక వంటకాలను ఆస్వాదించడంతో పాటు, శ్రీకాకుళం సాంస్కృతిక వారసత్వాన్ని ప్రత్యక్షంగా చూశారు. యాశస్వి కొండేపూడి, జానపద కళాకారుల ప్రదర్శనలు ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి. శ్రీ నటరాజ నాట్య మండలి, సోంపేట, డాన్స్ మాస్టర్ బిందు కామేశ్వరీ శిష్య బృందం వారు చేసిన జానపద నృత్య గీతాలు అలరించాయి. ఈ ఉత్సవం వెనుక కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే బెందాళం అశోక్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మార్గదర్శనం, అధికార యంత్రాంగం కృషి, స్థానికుల సహకారం స్పష్టంగా కనిపించాయి. రెండు రోజుల పాటు వేలాది మంది ప్రజల హాజరు, సాంఘిక మాధ్యమాల్లో పాజిటివ్ స్పందనతో ఈ వేడుక తీరప్రాంత పర్యాటనకు కొత్త దిశగా మారింది. ముగింపు రోజైన ఆదివారం బారువ తీరం జన సంద్రాన్ని తలపించింది. ఈ ఉత్సవం బారువ బీచ్‌ను పర్యాటక రంగంలో స్థిరంగా నిలబెట్టే తొలి అడుగుగా నిర్వాహకులు భావిస్తున్నారు. సముద్రంలోని నౌక అవశేషాల ఆధారంగా డైవింగ్ టూరిజం, పర్యావరణ విద్యా కేంద్రాల స్థాపన తదితర ప్రణాళికలతో బీచ్ భవిష్యత్తు మరింత ఆకర్షణీయంగా మారనుంది. సహజ సిద్ధమైన పకృతి అందాలకు నిలయంగా ఉన్న బారువ బీచ్ ఈ ఫెస్టివల్స్ తో పర్యాటక స్థలంగా ప్రభుత్వం తీర్చిదిద్దుతుందనే నమ్మకం ఈ ప్రాంతీయలకు కలిగిందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, సోంపేట మాజీ జెడ్పీటీసీ సభ్యులు సూరాడ చంద్రమోహన్, స్థానిక సర్పంచ్ ఎర్ర రజనీ అన్నారు. బారువ మేజర్ పంచాయతీ పరిధిలో ఉన్న18 మంది వార్డు సభ్యులు గ్రామస్తులు సహాయ సహకారాలు అందించారు. బీచ్ ఫెస్టివల్ రెండో రోజు అయిన ఆదివారం భారీ సంఖ్యలో వచ్చిన సందర్శకులుతో బారువ బీచ్ తీర ప్రాంతం పోటెత్తింది. ఈ రెండు రోజులు సుమారుగా గత బీచ్ ఫెస్టివల్ కంటే పదివేల జనాభా ఎక్కువగా వచ్చి ఉంటారని అంచనా. ఈ కార్యక్రమంనకు మెరైన్ అడిషనల్ ఎస్పీ జి బి ఆర్ మధుసూదన రావు, డి.ఎస్.పి . బి నాగేశ్వరరావులు సందర్శించారు. ఈ రెండు రోజులు బారువ మెరైన్ సీఐ డీవీజే రమేష్ కుమార్ తీర ప్రాంతంలో సముద్ర స్నానాలు ఆచరించే సందర్శకులు ప్రమాద బారిన పడకుండా తన సిబ్బందిని తీర ప్రాంతమంతా బందోబస్తు ఏర్పాటు చేసి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకున్నారు. సందర్శకులు ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆటవిడుపుగా కుటుంబ సభ్యులతో సరదాగా గడిపి, ప్రతి ఒక్కరూ క్షేమంగా ఇంటికి చేరుకునేటట్లు, లా అండ్ ఆర్డర్ పోలీసుల సహకారంతో, రిస్క్యూ టీం గజ ఈతగాళ్లు ఎన్ డి ఆర్ ఎఫ్, ఎస్ టి ఎఫ్ సహకారంతో ఈ బీచ్ ఫెస్టివల్ ప్రశాంతంగా ముగిసిందని మెరైన్ పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు ఎన్ శ్రీనివాసు ,ఎస్ శ్రీనివాస్‌రావు, ఏఎస్ఐలు మాధవరావు కోదండరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.




## ఆలయాలు.. ప్రశాంతతకు నిలయాలు

### కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు

**నరసన్నపేట/పోలాకి, మే 4 (వార్త):** ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలని ప్రతి ఒక్కరు ఆధ్యాత్మికతను అలవరుచుకోవాలని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని అలవర్చుకోవాలని సూచించారు. పోలాకి మండలం దీర్ఘాసి గ్రామంలో దుర్గమ్మ దుర్గామ్మ తల్లి 10 వార్షికోత్సవంలో నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తో కలిసి పాల్గొన్నారు. వారికి పూర్ణకుంభంతో ఆలయ సంప్రదాయం మేరకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ, హిందూ సంస్కృతి, సాంప్రదాయాలకు అద్దం పట్టే విధంగా గ్రామాల్లో ఆలయ వార్షికోత్సవాలు నిర్వహించడం హర్షనీయమన్నారు. ఆలయాల అభివృద్ధి కోసం స్థానికులు ఎంతో కృషి చేస్తున్నారని భవిష్యత్ లో ఇదే పంథాను కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. దుర్గా కాలనీ నుండి ఆలయం వరకు 20 లక్షల రూపాయిలతో నిర్మాణం చేపట్టిన సీసీరోడ్డును ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

## శక్తి యాప్‌పై విస్తృతంగా అవగాహన



**శ్రీకాకుళం క్రైం, మే 4(వార్త):** రాష్ట్ర ప్రభుత్వం మహిళలు భద్రత రక్షణ కొరకు అందుబాటులోకి తీసుకువచ్చిన శక్తి యాప్ ఉపయోగం, సేవలు, నిక్షిప్తం, రిజిస్ట్రేషన్ గురించి జిల్లాలో ప్రతి మహిళలు, విద్యార్థులకు విస్తృత స్థాయిలో శక్తి బృందాలు శక్తి యాప్ యొక్క ఆవశ్యకత ప్రాధాన్యత శక్తి యాప్ ద్వారా అందించే సేవలు ఇతర ఇతర వివరాలు గురించి విస్తృతస్థాయిలో అవగాహన కల్పించారు.జిల్లా ఎస్పీ శ్రీ కెవి మహేశ్వర రెడ్డి ఐపీఎస్ గారు ఆదేశాల మేరకు ఆదివారం శక్తి టీమ్ సిబ్బంది శక్తి యాప్ తో మహిళలు విద్యార్థులు కు రక్షణ భద్రత ఉంటుందని కావున ప్రతి ఒక్క మహిళ శక్తి యాప్ ఫోన్లో నిక్షిప్తం చేసుకుని రిజిస్ట్రేషన్ కావాలని శక్తి బృందాలు మహిళలు తెలియజేశారు. ఈ సందర్భంగా శక్తి యాప్ టీమ్ సిబ్బంది మాట్లాడుతూ శక్తి యాప్ యొక్క ప్రయోజనాలు సేవలు వివరించి మహిళలు అత్యవసర పరిస్థితుల్లో పోలీస్ స్టేషన్ కు వెళ్లాల్సిన అవసరం లేకుండా శక్తి అప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు అని ,మహిళలకు ఆపద సమయంలో అత్యవసర సాయం అందించేందుకు శక్తి యాప్ ఒక అయుధం గా పనిచేస్తుంది అన్నారు. ప్రతి ఒక్క మహిళ విద్యార్థులు ఈ యొక్క ఫోన్లో డౌన్లోడ్,రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.














Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546